క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

మండపేట: పట్టణంలోని సంగంకాలనీ ఎంపీపీ పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎంఈవో నాయుడు రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంఈఓ సర్టిఫికెట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. వేడుకలకు హాజరైన తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో చూసి మురిసిపోయారు. కార్యక్రమంలో సీఆర్పీ నారాయణరావు, ఉపాధ్యాయుడు చిట్టూరి వెంకటశ్రీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

మండపేట: పట్టణంలోని శ్రీరామ హిందూ మున్సిపల్ యూపీ స్కూల్‌లో శనివారం విశ్రాంత ఉద్యోగులు సమావేశం నిర్వహించనున్నట్టు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి పెంకే గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. సమావేశానికి విశ్రాంత ఉద్యోగులందరూ తప్పని సరిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు

కాజులూరు: కంటి సమస్యలను అశ్రద్ధ చెస్తే మనిషి అంధత్వానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ వక్త, విశ్రాంత ఉపాధ్యాయుడు గుత్తాల శ్రీరాములు అన్నారు. కోలంకలో గురువారం బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శ్రీరాములు మాస్టారు ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గుంటూరు మాణిక్యాలరావు మాట్లాడుతూ శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారన్నారు. వీరిని ఆసుపత్రికి తరలించి. ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. మరో 30 మందికి కళ్ళజోళ్లు, మందులు పంపిణీ చేశామన్నారు. వైద్యులు నాగేశ్వరరావు, శివ, స్థానిక నాయకులు పచ్చిపాల ఏడుకొండలు, కొల్లి రాంబాబు, వినకోటి కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మవార్ల జాతర

మండపేట: పట్టణ దేవతలుగా విరాజిల్లుతున్న కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. కేపీ రోడ్డులోని సర్దార్ వేగుళ్ల వీర్రాజు సంతమార్కెట్ కొలువుతీరిన అమ్మవార్ల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కామేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా గరగ నృత్యాలు, తీన్‌మార్, బాణసంచా, విద్యుత్ దీపాలంకరణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలం పరిధిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు. ఎనిమియా నివారణకు ప్రతి గురువారం ఈడ్రాప్స్ అందిచనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్యం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో గురువారం సదస్యం కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం సామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవ నిర్వహించారు. వేదపండితులు మంత్రాల పఠనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కల్యాణోత్సవాలు సందర్భంగా కేశవ దీక్ష చేపట్టిన భక్తులు ఈఓ భాగవతుల ఆధ్వర్యంలో ర్యాలి నుంచి వాడపల్లి క్షేత్రానికి కాలినడకన వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

మూగజీవాలను కాపాడుకోండిలా

- పశువులకు ఎండ దెబ్బ
- వేసవి వ్యాధులపై అప్రమత్తత అవసరం
- ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశు వైద్యుల సూచన



వేసవి తాపానికి చెరువులో సేదతీరుతున్న పశువులు

రామచంద్రపురం రూరల్: ఎండలు మండుతున్నాయి. వేసవిలో పశువులకు అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పశువులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వ్యాధుల బారిన పడకుండా చూడాలి. వాటికి ముందస్తుగా టీకాలు వేయించి కాపాడుకోవాలని రామచంద్రపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పశువుల పోషకులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

జబ్బవ్యాధి

మూడేళ్లు పైబడి బలిష్టంగా ఉన్న ఎడ్లలో జబ్బవ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. జబ్బ వాస్తుంది. మేత తినవు, ఈ వ్యాధి రాకుండా ఏటా బిక్యూ వ్యాక్సిన్ వేయించాలి.

గొంతువాపు

ఈ వ్యాధి గేదె జాతుల్లో వస్తుంది. గొంతు బాగా వాస్తుంది. కంటి నుంచి నీరు కారుతుంటుంది. 106 డిగ్రీల జ్వరం వస్తుంది. ఇది అంటువ్యాధి. ఒక పశువు నుంచి మరొక పశువుకు సోకుతుంది. ఈ వ్యాధి వచ్చిన వెంటనే సమీపంలో ఉన్న పశువైద్యాధికారుల వద్దకు తీసుకువెళితే హెచ్ఎస్ వ్యాక్సిన్ వేస్తారు.

గాలికుంటు

ఈ వ్యాధి సోకిన పశువుల పెదవులకు పొక్కులు, కురుపులు వస్తాయి. జ్వరం 100 డిగ్రీలు ఉంటుంది. పశువులు చనిపోవుకానీ పాలదిగుబడి తగ్గిపోతుంది. ఈ వ్యాధి సోకకుండా ఏడాదికి రెండుసార్లు పశువైద్యశాలకు తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించాలి.

పాలజ్వరం

పాడి పశువులు ఈనిన తరువాత పాలజ్వరం బారినపడే అవకాశం ఉంది. ఈ వ్యాధిపై రైతులకు అవగాహన తప్పనిసరి. పాలజ్వరం అంటే పాడి పశువు జ్వరంతో బాధపడడమేనని రైతులు భావిస్తారు. కానీ, అది సరికాదు, ఆరోగ్యవంతమైన పశువు శరీర ఉష్ణోగ్రత 101.4 డిగ్రీలు ఉంటుంది.



డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున, పశు వైద్యాధికారి, రామచంద్రపురం

పాలజ్వరం వచ్చిన పశువు శరీర ఉష్ణోగ్రత 97 నుంచి 99 డిగ్రీలకు తగ్గిపోతుంది. ఈ వ్యాధి ఎక్కువగా ఆవులు, గేదెలు ఈనిన వారంలోపు అధిక పాలదిగుబడినిచ్చే పశువుల్లో కనిపిస్తుంది. పొదుగులో ఉన్న మొత్తం పాలు పితకడం వల్ల పాలజ్వరం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

జున్నుపాలు

సాధారణ పాలల్లో ఎక్కువ శాతం కాల్షియం నష్టపోయి ఈ జ్వరం బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధి వచ్చిన పశువులు తల, మెడ ఒకవైపుకు తిరిగి తలను డొక్కలో పెట్టుకుని పడుకుంటాయి. నీరసంతో లేవలేవు. మేత మేయక శరీరం చల్లగా ఉంటుంది. ఒక్కోసారి పైకి లేవాలని ప్రయత్నించి కిందపడిపోతాయి. తన్నుకోవడం, కండరాలలో వణుకు స్పష్టంగా కనిపిస్తుంది. కళ్ల నుంచి నీరుకారుతూ చెవులు వాలిపోయి ఉంటాయి. పశువు చిరాగ్గా ఉండి తరచూ ఉలిక్కిపడుతుంటుంది.

నివారణ మార్గం

ఈ వ్యాధి నివారణకు పొదుగు నుంచి మొత్తం పాలు పితకకూడదు. చూడితో ఉన్న సమయంలో సమీకృత ఆహారం అందించాలి. పశువైద్యుని సలహా మేరకు చూడితో ఉన్నప్పుడు ఈనిన తర్వాత కాల్షియం, మెగ్నీషియం మందులు వాడాలి. చూడితో ఉన్నప్పటి నుంచి ఖనిజ లవణాలను రోజుకు 30 నుంచి 50 గ్రాముల దాణాతో కలిపి పెట్టాలి. పాలజ్వరం వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కాల్షియం, మెగ్నీషియం మందును నరాల ద్వారా రక్తంలోకి వైద్యుని పర్యవేక్షణలో ఎక్కించాలి. పశువుకు విశ్రాంతి తప్పనిసరిగా ఇవ్వాలి.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. విద్యుత్‌లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం కపిలేశ్వరపురం, వెదురుమూడి, పడమర ఖండ్రిక గ్రామాల్లో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయవరం మండలంలో..

రాయవరం: మండలంలోని పసలపూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా పసలపూడి, యర్రమట్టిపురం, నరాలవారిపాలెం, చెల్లూరు గ్రామాలతో పాటు రామచంద్రపురం వెళ్లే దారిలో ఉన్న లెప్రసీ కాలనీలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు, సంగం కాలనీ, విజయలక్ష్మినగర్, సత్యశ్రీ రోడ్డు, మెయిన్ రోడ్డు, బస్టాండ్, తర్వాణీపేట, బ్యాంకు కాలనీ, శ్రీలక్ష్మినగర్, పెద్ద కాలువ, వీరభద్రపురం, మెహెర్‌బాబా ఆశ్రమం తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రామచంద్రపురం రూరల్: ఫీడర్ల మరమ్మతుల కారణంగా రామచంద్రపురం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ద్రాక్షారామ ఫీడర్, 11 కేవీ హసన్‌బాద ఫీడర్‌ల మరమ్మతుల నిమిత్తం హసన్‌బాద, ఉండూరు, భీమక్రోసుపాలెం, తాడిపల్లి, కాపవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అందరికీ విద్యార్థి మిత్ర కిట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో పీఆర్ఎల్ మూర్తి

రాయవరం: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ ముందస్తు ఏర్పాట్లపై కమిటీలతో ఎంఈవో–2 వై.సూర్యనారాయణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు కిట్లను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు అందజేసే యూనిఫాం, షూ, సాక్సులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు తదితర సామగ్రిని అందజేసేందుకు ముందుగా స్టాక్ పాయింట్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. స్టాక్ పాయింట్లలో వస్తువులు క్రిమి కీటకాలు, ఎలుకల వలన పాడవ్వకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కాంపొనెంట్‌ల వారీగా కమిటీలను నియమించి, వారి బాధ్యతలను తెలియజేయాలన్నారు. త్వరలోనే మండల స్టాక్ పాయింట్లకు సామగ్రి చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎస్.రామారావు, డీఈవో ఎ.కె.మూర్తి, సీఆర్‌ఎంటీలు కిలపర్తి పోసిరాములు, వై.ఎల్.వీర్రాజు, వాసంశెట్టి సీతా ధనలక్ష్మి, కె.నీనాసిరి, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాత ఆందోళన

కాజులూరు: మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భానుడు ఉగ్రరూపం చూపించగా సాయంత్రం ఆకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు సంభవించి ఈదురు గాలులు వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజానీకానికి ఒక్కసారిగా చల్లగాలులు వీయడంతో సేదతీరారు. అయితే కొద్దిసేపటిలో బలమైన ఈదురు గాలులుగా మారడానికి తోడు వర్షంతో కలసి బీభత్సం సృషించడం ప్రజలు ఆందోళనలకు గురయ్యారు. ఈ అకాలవర్షం వ్యవసాయరంగానికి తీవ్రనష్టం కలుగజేస్తుందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో అధిక శాతం పొలాలు ఈనిక దశ నుంచి గింజగట్టి పడే దశలో ఉన్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం అన్ని దశలలో ఉన్న పంటలకు నష్టం కలుగజేసింది. ఈదురుగాలులకు వరి నేలకు ఒరిగిపడిపోగా, ఈనిక దశలో ఉన్న మొక్క మొవ్వుపువ్వారంలోనికి నీరు చేరితే గింజ తాలు, తప్పలుగా మారిపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. మరో పక్క పిందెలు, నిండైన కాయలతో ఉన్న మామిడి చెట్లకు వర్షాలు కారణంగా తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఈదురు గాలులకు పక్వానికి రాకుండానే మామిడి కాయలు రాలిపోయి నష్టాలను తెచ్చిపెట్టాయి.

ప్రకృతి సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి



పీడీఎంఎస్ విత్తనాలను అందజేస్తున్న ఏవో ప్రభాకర్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బాబూరావు తదితరులు

రాయవరం: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండలంలోని కూర్మాపురం రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్తంగా రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి రైతు కనీసం 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా చూడాలన్నారు. రబీ వరి కోతలు కోయడానికి వారం రోజులు ముందుగా పిల్లి పెసలు, మినుములు, పెసలు, తెల్ల జొన్నలు, మొక్కజొన్నలు, జీలుగ, గంట్లు, జనుములు, ఉలవలు, బొబ్బర్లు, పొట్టి శనగలు వంటి 13 రకాల విత్తనాలతో కూడిన పీడీఎంఎస్ కిట్లను అందజేస్తామన్నారు. ఎకరానికి 10 కేజీల వంతున రైతులు పొలంలో చల్లుకుంటే వేసవిలో పంట భూమి ఖాళీగా ఉండకుండా ఉంటుందన్నారు. పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా రైతుకు నికర ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రతి రైతు పీఎండీఎస్ విత్తనాలను పొలాల్లో చల్లుకుని పంట పొలాలను సారవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఎ.బాబూరావు మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు చేయడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గి, నికర లాభం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితుల్లో సారవంతమైన భూమిని కాపాడుకోవడానికి ఇది చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ కొరిపెల్ల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ముత్యాల చంద్రశేఖర్, జానకిరామయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం

- ఏఓ సత్యప్రసాద్
- రైతులకు పచ్చిరొట్టల విత్తనాల పంపిణీ

రామచంద్రపురం రూరల్: రైతులు రబీ, ఖరీఫ్ పంటల మధ్యలో పచ్చిరొట్టలు సాగు చేయడం ద్వారా నేల సారవంతమవుతుందని మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని ముచ్చుమిల్లిలో ఆయన ఆధ్వర్యంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలసి పీఎండీఎస్(ప్రీ మాన్సున్ డ్రై సోయింగ్) కిట్లు తయారు చేసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ, ఖరీఫ్‌ల మధ్యలో భూమిని ఖాళీగా వదిలివేయడం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకి పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయని తెలిపారు. దీనికి బదులు పెసలు, మినుములు, పచ్చి రొట్టల సాగు వలన భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, పంటలకు నత్రజని, పోటాస్, భాస్వరం



ముచ్చుమిల్లిలో రైతులకు పీఎండీఎస్ కిట్లు అందజేస్తున్న ఏఓ సత్యప్రసాద్

తదితర పోషకాలు సమృద్ధిగా లభించి పంటలు అధిక దిగుబడినిస్తాయని వివరించారు. పీఎండీఎస్ కిట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద, రైతు సేవా కేంద్రాల్లోను అందుబాటులో ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హోమియో దినోత్సవం

మండపేట: స్థానిక గౌతమి హోమియో క్లినిక్‌లో గురువారం ప్రపంచ హోమియో వైద్య దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ వైద్యుడు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత హోమియోపతి పితామహుడు డాక్టర్ హానేమాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి మాట్లాడుతూ హోమియోపతి వైద్యం అనేక వ్యాధుల నివారణలో విశిష్ట పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మానవాళి శ్రేయస్సు కోసం విశిష్టమైన పరిశోధనలు చేసిన డాక్టర్ హానెమాన్ సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ కృష్ణార్జున చౌదరిని ఘనంగా సత్కరించారు. రవికుమార్‌ను పీఎంపీ అసోసియేషన్



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిక్కిన

అధ్యక్షుడు కోన సత్యనారాయణ శాలువాతో సత్కరించి, 60 సంవత్సరాల సావనీర్‌ను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మెహర్ ప్రసన్న, సూర్యచంద్ర హోమియో దుర్గా ప్రసాద్, జి.స్వామి ప్రసాద్, సాహెబ్, మీరా సాహెబ్ అయ్యప్ప, పవన్, చిన్న, శ్రీనివాస్, డాక్టర్ నీరజ, కృష్ణవేణి,, కుమారి, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిబాట, బంగారు బాట


సఖినేటిపల్లి: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట అనే కార్యక్రమాన్ని అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ–1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేరించండి, భవితకు బంగారు బాట వేసుకోండి అంటూ ఇంటింటా ఉపాధ్యాయులు ప్రచారం చేపట్టారు. ఈ మేరకు పిల్లలను చేర్పిస్తూ ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రాలనుఅందించారు. ప్రైమరీ పాఠశాల హెచ్ఎం కె.వి.నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ జ్యోతి, టీచర్ బషీర్ బేగం, హైస్కూల్ హెచ్ఎం జాన కనక లింగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ కనకదుర్గ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు పాఠశాలలో పిల్లలను చేర్పించే అడ్మిషన్ పత్రం ఇస్తున్న విద్యాశాఖాధికారులు

మొండెపులంకలో డెంగీ కేసు

పి.గన్నవరం: మొండెపులంక గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలికి డెంగీ పాజిటివ్ నమోదయ్యిందని నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి వైవీ ప్రియాంక తెలిపారు. ఈనెల ఒకటో తేదీన వృద్ధురాలు అనారోగ్య కారణంగా కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఈనెల 8న ఆమెకు రక్త పరీక్షలు చేయగా, డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించారు. దీంతో అదే ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారని ప్రియాంక వివరించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ నుంచి వచ్చిన సమాచారంతో నాగుల్లంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మొండెపులంక గిడుగువారిపాలెం ప్రాంతంలో వైద్యాధికారులు టీమ్‌లు ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్ల మధ్య ఏబేటు మందు స్ప్రే చేయించారు. పంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆప్రాంతంలో పర్యటించి దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మహమ్మద్ రియాజ్ తున్నీషా బేగం, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ ఎం.నాగరాజు, ఎంపీహెచ్ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గిడుగువారిపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 1100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఆ శాఖ సీఐ కే కాత్యాయని తెలిపారు. విస్తృత దాడుల్లో భాగంగా ఆత్రేయపురం మండలం రాజవరం సమీప గోదావరిలో ప్లాస్టిక్ పీపాలతో ఉంచిన బెల్లపు ఊటను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. అలాగే వెలిచేరు గ్రామానికి చెందిన వీరమళ్ల వెంకటసత్యనారాయణ అనే వ్యక్తిని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి సన్నిధిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి సుందర్‌కుమార్ దంపతులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారిని విశ్రాంత ఐఏఎస్ అధికారి సుందర్‌కుమార్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. గతంలో దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌గా పని చేసిన ఆయనకు ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆ దంపతులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితుల వేదాశీర్వచనాలు అందజేశారు. ఈఓ దుర్గాభవాని వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



మండపేటలో 20వ రోజు దీక్ష చేస్తున్న మహిళలు

మండపేట: జనావాసాల నడుమ మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 28, 29, 30 వార్డుల మహిళలు, ప్రజలు గురువారం 20వ రోజు దీక్ష చేసి నిరసన తెలిపారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపు ముందు ధర్నా చేశారు. ఇళ్ల మధ్య వైన్ షాపు తొలగించే వరకూ ఆందోళన విరమించేది లేదని మహిళలు స్పష్టం చేశారు. దీక్షల్లో నల్లి రాణి, ముని లక్ష్మి, గుత్తుల చిరంజీవి, ములకాల బేబి, మాండ్రు విజయలక్ష్మి, వట్టికూటి సూర్యకుమారి, లంక పద్మ, గన్నేడ కనకమహాలక్ష్మి, వనపర్తి సిరి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న స్వామిప్రసాద్

మండపేట: ఆధునిక కాలంలో యువత సెల్‌ఫోన్ మాయలో పడి పుస్తకాల్లో నిక్షిప్తమైన అపారమైన జ్ఞాన సంపదను విస్మరిస్తున్నారని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ అన్నారు. మండలంలోని ద్వారపూడిలో గురువారం అరసం 90వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అరసం జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రముఖ కవులు బండారు రాము, తూలూరి నరేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు సెల్‌ఫోన్ మాయలో పడి మంచి జ్ఞానాన్ని ప్రసాదించే పుస్తకాలను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 27న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సాహిత్య అభిమానులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

పత్రవిచిత్రం



వివిధ రంగులతో ఆకట్టుకుంటున్న మామిడి చెట్టు

ఫలాల్లో రారాజు మామిడి. పలువురు రైతులు పొలాల్లో, ఇంటి వద్ద మామిడి పంటను సాగు చేస్తున్నారు. మామిడి చెట్లు పూత విరబూస్తే తెలుపు రంగు సంతరించుకుంటాయి. రాయవరం మండలం సోమేశ్వరంలో ఓ మామిడి చెట్టు మాత్రం రెండు రంగుల్లో కనువిందు చేస్తుంది. ఒక పచ్చని ఆకులతో..మరో పక్క లేలేత ఎర్రని చిగురుటాకులతో కనిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది.

రాయవరం